ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 21 | సంచిక : 10 | జూన్ 2016

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

22-03-2016
చించినాడ
20-03-2016
భీమవరం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 22-03-2016, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇక్కడ మనం ప్రధమంలో కృష్ణపరమాత్మను జ్ఞాపకం పెట్టుకోవాలి, తరువాత నర్సింహరాజుగారిని జ్ఞాపకం పెట్టుకోవాలి. నర్సింహరాజుగారు చిన్నరైతు. చందాలు ఏమీ లేకుండా ఆయన ఒక్కరే కష్టపడి, ఎక్కువ పనులు ఆయనే చేసుకొంటూ, అవసరమైనప్పుడు వర్కర్సును పెట్టుకొని అలా ఇక్కడ గీతామందిరం నిర్మించారు. కృష్ణుడు చెప్పిన మాటలు శ్రవణం చేయండి, రాముడు ఆచరించినట్లు ఆచరించండి అని చెపుతూ ఉంటారు. రాముడు ఆచరించినట్లు మనం ఆచరించవచ్చు. కృష్ణుడు చేసిన పనులు మనం చేయలేము. ఆయన ఆచరణ మనకు అందని విషయం. రాముడు మనకు అందుతాడు. గాంధీగారికి అభిమాన గ్రంధం భగవద్గీత, ఆయన అభిమాన దేవుడు రాముడు. కలియుగంలో మంచితనం కంటే చెడ్డ ఎక్కువ ఉంటుంది. మంచిగా ప్రవర్తించేవాళ్ళు తక్కువగా ఉంటారు. ఏ మంత్రాన్ని జపించటం వలన కలియుగ దోషాలు పోతాయి అని నారదుడు బ్రహ్మదేవుడిని అడిగాడు. అప్పుడు బ్రహ్మదేవుడు

**హరేరామ హరేరామ రామరామహరేహరే**

**హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణహరేహరే**

అని ఈ మంత్రాన్ని చెప్పాడు. అప్పుడు నారదుడు యింకోమంత్రాన్ని కూడా చెప్పండి అని అడిగితే మీరు ఎన్నిసార్లు అడిగినా కానీ ఈ మంత్రాన్నే చెపుతాను అని బ్రహ్మదేవుడు అన్నాడు. ఇది మహామంత్రం, దీనితో సమానమైన మంత్రం లేదు. ఈ మంత్రాన్ని అనుకోవటం వలన

కలియుగంలోని దోషాలు అన్నీ నశిస్తాయి అని బ్రహ్మదేవుడు నారదుడికి ఉపదేశించాడు.

కృష్ణుడిని మనం ఎలా పొందాలో కృష్ణుడే రాధ కింద వచ్చి మనకు చూపించాడు. రాధవేరు, కృష్ణుడు వేరుకాదు. అలౌకికమైన ఆప్యాయత ఎలా ఉంటుంది, భగవంతుడిని ఎలా ప్రేమించాలి, ఆయన పట్ల మనం ఎలా ప్రవర్తించాలి ఇవన్నీ కృష్ణుడే రాధగా వచ్చి ప్రదర్శించాడు. అవే రాధాకృష్ణ లీలలు. శ్రీకృష్ణచైతన్యుడు జితేంద్రియుడు కాదు, వాడు అతీంద్రియుడు. వాడి నాలుకమీద పంచదార వేసి రెండు నిమిషాల తరువాత మీ పంచదారను మీరు తీసుకోవచ్చు. అందులో ఒక్క పంచదార పలుకు కూడా వాడి నాలుకమీద కరుగదు, మీరు పంచదార వేసారని అక్కడ లాలాజలం ఏమీ ఊరదు, అటువంటి అతీంద్రియుడు. శ్రీకృష్ణచైతన్యుడిది గౌడీయమత సాంప్రదాయం. గౌడీయమతం వారు భాగవతప్రియులు. వాళ్ళు భాగవతం ఎక్కువగా చదువుతారు. భాగవతం మహాపురాణం, అందులో అంతా భక్తే, భగవంతుడిని ప్రేమించి భగవంతుడిలో ఐక్యమవ్వటం, అది ప్యూర్‌లవ్, అందులో వ్యాపారం ఏమీ ఉండదు. భగవంతుడిలో ఐక్యమవ్వటానికి అనేక మార్గాలను వ్యాసుడు భాగవతంలో చూపించాడు. కానీ యిప్పుడు ఆ ప్రాచీనగ్రంధాలను చదివేవారు తగ్గిపోయారు. వాటిని చెప్పే పండితులు తగ్గిపోతున్నారు, వినేవారు తగ్గిపోతున్నారు. పూర్వం రాజులు ఈ పండితులను పోషించి, వారిచేత పురాణాలు చెప్పించేవారు. ఇప్పడు పండితులకు ఆదరణ కూడా తగ్గిపోయింది. యిప్పడు ప్రజలకు ఆకర్షణ కోసం డాన్సులు, సినిమాలు పెడుతున్నారు. ప్రజలు బాగుపడటం మనం చూడాలి కాని ప్రజలు ఎక్కువగా రావటం కాదు మనకు కావలసింది. ఏ రకంగా మనం ఏర్పాట్లు చేస్తే వారు బాగుపడతారు అనేది మనం చూడాలి కానీ తాత్కాలికంగా ఉద్రేకపరిచే విషయాలు కాదు. వారు బాగుపడే విధానం మనం చూడాలి, దానికి ఒక ప్లానింగు ఉండాలి. దానికి మన ప్రాచీనగ్రంధాలు అన్నీ ఒక ప్లానింగ్‌తో చక్కని పునాది వేసాయి.

భగవాన్ దగ్గరకు వచ్చేటప్పటికి ఈ శరీరాలు అన్నీ బొమ్మలు, యిది ప్రపంచం కాదు, ఇది ఒక బొమ్మలాట అన్నారు. మనం అందరం బొమ్మలే. ఈ బొమ్మలు యాక్ట్ చేయటానికి కామక్రోధాలు, దేహబుద్ధి, యిష్టాలు, అయిష్టాలు ఇవి అన్నీ ఆ బొమ్మలో కలిపారు. యిది బొమ్మలాట అని నేను చెప్పటం కాదు, మీ బ్రెయిన్ కనుక కొంత ముగ్గితే మీకు ఎవరూ చెప్పనక్కరలేదు, యిది బొమ్మలాట అని మీ అంతట మీకు తెలుస్తుంది. మీరు ఏదయినా

కారణాల వలన దుఃఖపడుతున్నారు అనుకోండి. మీకు జ్ఞానం కలిగాక ఏమని అనిపిస్తుంది అంటే అనవసరంగా దుఃఖపడ్డాము ఏమిటి అనిపిస్తుంది. ఏదో ఉందని మీరు ఊహించుకోవటం వలన దుఃఖం వస్తోంది. నువ్వు సమానంగా ఉండాలి. ఎవరయినా ఇతరులు మాట్లాడేటప్పుడు వాడు ఏ ఉద్దేశ్యంతో మాట్లాడుతున్నాడో గ్రహించే శక్తి మీకు ఉండాలి. వాడు మీ క్షేమం కోరుతున్నాడా, లేదా అనేది మీరుగ్రహించగలగాలి. వాడు మీ క్షేమం కోరటంలేదు అని మీకు అర్థమయినప్పుడు వాడి మాటలు పట్టించుకోవద్దు, విని ఊరుకోవటమే. సమాన బుద్ధి కలవాడు పుణ్యపాపముల చేత బంధింపబడడు, పుణ్యము, పాపమూ రెండూ సంకెళ్ళే. పుణ్యం వలన మంచి జన్మలు రావచ్చు , పాపం వలన మంచి జన్మలు రాకపోవచ్చు. కానీ ఈ రెండూ కూడా సంకెళ్ళే. కర్తృత్వం ఉన్నంతకాలం జన్మలు వస్తూ ఉంటాయి. అందుచేత కర్తృత్వంతోటి నువ్వు పుణ్యం చేసినా మరలా దాని అనుభవం కోసం శరీరం వస్తుంది. శరీరం వచ్చిన తరువాత ఆ శరీరం వలన కొన్ని సమస్యలు వస్తూ ఉంటాయి. ఏమో ఆ వాతావరణం ఎలా ఉంటుందో, ఎటువంటి స్నేహాలు దొరుకుతాయో అది మనం చెప్పలేము. అందుచేత పుణ్యపాపములు రెండింటినీ మీరు అతిక్రమించాలి. కొంతమంది పుణ్యం వస్తుంది అంటే కాని ఆ పని చేయరు. అది కూడా బలహీనత, అది కూడా ఒక దోషమే.

నువ్వు చేసే పని నేర్పుతో, ఓర్పుతో కనుక చేస్తే అదియోగం అవుతుంది. యోగః కర్మసుకౌశలం. యిది తిలక్ గారి మంత్రం. చాలామందికి అసలు మాట్లాడటం తెలియదు. నువ్వు మాట్లాడేటప్పుడు దానికి ఒక క్రమం ఉండాలి, నేర్పుగా మాట్లాడాలి. మనందరికి మాటలు వచ్చు గానీ మాట్లాడటం ఎవరికీ తెలియదు అని ఒక ఆయన అన్నారు. ఏమాట మాట్లాడాలి, ఏమాట మాట్లాడకూడదు, మనం ఈ మాట మాట్లాడితే అది ఎక్కడికి దారి తీస్తుంది అనేది చాలామందికి తెలియదు. మనం నోటికి వచ్చినట్లు మాట్లాడకూడదు. మాట్లాడేట్పడు క్రమం తప్పకూడదు. ఎదుటివాళ్ళు ఏదయినా చెపుతూ ఉంటే కొంతమంది వారిని పూర్తిగా చెప్పనివ్వరు. వీళ్ళు అడ్డు వెళ్ళిపోతారు. అంటే అసలు కామన్‌సెన్స్ లేదు. ఆ చెప్పేవారిని పూర్తిగా చెప్పనివ్వాలి. మీరు ఏపని చేసినా అది ఓర్పుగా చెయ్యాలి, నేర్పుగా చెయ్యాలి, దీర్ఘకాలం మన్నేలాగ చేయాలి, అది యోగం. గాలి పీల్చుకోవటం, విడిచిపెట్టడం అదే యోగం కాదు. నువ్వు చేస్తున్న పనిలో, మాట్లాడే మాటలో, మీ జీవితవిధానంలో నువ్వు క్రమంగా ఉండటం కూడా యోగమే. కొంతమంది పనిచేస్తే చాలా నీట్‌గా ఉంటుంది, అది

చిన్నపని అయినా పెద్ద మనస్సుతో చేస్తారు. అలా చెయ్యాలి. అలా పని చేయటం కూడా యోగమే. కేవలం గుడికి వెళ్ళి కూర్చోటం, ఏదో పూజలు చేయటం కాదు, నీ జీవితవిధానం కరెక్టుగా ఉండాలి. భగవంతుడు నీకు కేటాయించిన పనిని పెర్‌ఫెక్ట్‌గా చెయ్యటం కూడా యోగమే. దానివలన భగవంతుడికి నీ పట్ల ప్రీతి కలుగుతుంది. భగవంతుడి దయ నీ శరస్సు మీద వర్షించటానికి అది కారణం అవుతుంది.

పూర్వం అనేకమంది మహాత్ములు భారతదేశంలో జన్మించారు, వారు అన్ని పుణ్యక్షేత్రాలు దర్శించారు. మీకు ఈ కొండ తప్పించి ఏమీ లేదు. మీరు ఎక్కడికీ వెళ్ళరేమిటి అని భగవాన్‌ను అడిగితే నాకు సంకల్పం వస్తూఉంటే దానిని బలవంతంగా ఆపు చేయటం లేదు, అసలు వెళ్ళాలనే సంకల్పమే నాకు రావటంలేదు అని చెప్పారు. నీలో దోషం ఉన్నప్పుడు నీకు తలంపు వస్తుంది. అసలు తలంపు వచ్చింది అంటే అదే పాపం. ఎక్కడికి వెళ్ళినా నాకు చూడడానికి ఏమీ లేదు, వినటానికి ఏమీ లేదు అనేవారు భగవాన్. మరి మీరు ఈ కొండవంక చూస్తున్నారు ఏమిటి అని అడిగితే నేను కొండవంక చూడటం ఏమిటి? నన్ను నేను చూసుకొంటున్నాను అనేవారు. నీ బుద్ధి మోహాన్ని అతిక్రమించి వెళ్ళినప్పుడు నీకు ఈ ప్రపంచంలో చూడదగినది కాని, వినదగినది కానీ ఏమీ లేదు. అసలు ఏ విషయం కూడా వినాలని ఉండదు, వాటిపట్ల నీకు విరక్తి ఉంటుంది, కొంతమంది లోకం గొడవలు చాలా శ్రద్ధగా వింటారు దానికి కారణం వారికి లోపల మోహం ఉందికాని అది వారికి తెలియదు. శాస్త్రం చెప్పే చోట వారు ఉండరు, లోకం గొడవలు చెపుతూ ఉంటే అక్కడ వారు కూర్చుంటారు దానికి కారణం వారి బుద్ధి మోహంలో ఉంది. బుద్ధి మోహంలో ఉన్నప్పుడు ఆ మోహాన్ని తొలగించే విషయాలు వినాలని అనిపించదు. నిన్ను నువ్వు చంపుకోవటం నీకు ఇష్టం ఉండదు కదా. నువ్వు మోహాన్ని దాటినప్పుడు ఇంక నీకు ఏదీ వినాలనిపించదు. ఇదివరకు విన్న విషయాల మీద కూడా నీకు విరక్తి కలుగుతుంది.

లోకంలో ఏముంది, లోకంలో ఏమీలేదు, సౌందర్యం అంతా లోపలే ఉంది కాని లోకంలో ఏమీ లేదు. లోకం అంతా దుమ్ము. ఏదేశం వెళ్ళినా, ఎవరింటికి వెళ్ళినా రాగద్వేషములు తప్పించి లోకంలో ఏముంది అన్నాడు బుద్ధుడు. ఈ లోకంలో అంతా దుమ్మే కానీ సారవంతమైనది ఏదీ లేదు. అయితే ఎక్కడయితే నీకు కోరిక ఉందో అక్కడ ఏదో ఉంది అని నీకు అనిపిస్తుంది. ఇదే మాయ. అక్కడ ఏమీ లేకపోయినా నీ కోరిక వలన

అక్కడ ఏదో ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ సృష్టిలో ఏమీ లేదు, సౌందర్యం అంతా నీ హృదయంలోనే ఉంది, బయట ఏమీ లేదు. ఇంక చూడటానికి ఎక్కడికి వెళతావు. నీకు మోహం ఉంటే నీకంటే వేరుగా ఏదో కనిపిస్తూ ఉంటుంది. నీకు మోహం లేనప్పుడు చూడటానికి నీకంటే అన్యంగా ఏమీ లేదు. భగవాన్‌ది సుప్రీమ్‌స్టేట్. రామకృష్ణపరమహంసగారు సబ్జక్టు బాగా చెప్పినా కాళికాదేవి కనిపించటం అని ఇటువంటి గొడవలు ఏవో ఉన్నాయి. అవి నిజమే అయి ఉండవచ్చు. నీకు ధ్యానబలం ఉంటే భగవంతుడు కనిపించవచ్చు. భగవాన్‌ది ఫైనల్. దీనికి పైన ఇంక ఏమీ లేదు. అసలు లోకాల గొడవ లేదు. అసలు నువ్వు ఉంటే కదా ఈ గొడవలు అన్నీ. నువ్వు ఉన్నావో లేదో చూసుకో. మొత్తం ఈ సృష్టి అంతా కూడా నేను అనే తలంపు మీద ఆధారపడి ఉంది. ఈ నేను అనే తలంపు రాలిపోయింది అంటే ఖగోళం అంతా కూడా ఒక్కసారిగా పడిపోతుంది. ఇంక ఎక్కడ ఏమీ లేదు.

మీకు ఎప్పుడయినా దుఃఖం వస్తూ ఉంటుంది. ఆ దుఃఖానికి ఏమయినా రూపం ఉందా? ఏమీ లేదు. మీకు యిష్టంలేని తలంపులు వస్తూ ఉంటే మీకు దుఃఖం వస్తుంది. మీకు యిష్టమైన తలంపులు వస్తూ ఉంటే మీకు సంతోషం వస్తుంది. అంటే ఈ తలంపులు ఎంత నిజమో ఆ దుఃఖం అంతే నిజం, ఈ తలంపులు ఎంత నిజమో ఆ సంతోషం అంతే నిజం. అయితే మీరు ఎనాలసిస్ చేసుకోవాలి. భగవాన్‌తో చదువుకున్నవాడు ఒకడు డిఎస్పీ అయ్యాడు. ఒక హొటల్‌లో భగవాన్ ఫోటో చూసాడు. వీడు మా తోటి చదువుకొన్న పిల్లవాడు, వీడిని పూజిస్తున్నారు ఏమిటి అని అడిగాడు. ఆయన మీతో చదువుకొని ఉండవచ్చు కానీ ఇప్పుడు ఆయనను దేవుడిగా ఆరాధిస్తున్నారని చెప్పారు. తరువాత ఒక నెలకు అతను భగవాన్‌ను చూడడానికి తిరువణ్ణామలై వచ్చాడు. చిన్నప్పుడు చదువుకొన్న సంగతి మర్చిపోయాడు అనుకొని నేను ఫలానా అని చెపుదాము అనుకొన్నాడు. భగవాన్ ముందుగానే అతనిని పేరుపెట్టి పిలిచి చిన్నప్పుడు ఎలా మాట్లాడుకొనేవారో ఇప్పుడు అలాగే మాట్లాడారు. నిన్ను చాలామంది పూజిస్తున్నారు. నువ్వు చాలపైకి వచ్చావు అని అతను భగవాన్‌తో అన్నాడు. నేను పైకి వెళ్ళాను అంటున్నావు నేను పైకి వెళ్ళలేదు, నువ్వే పైకి వెళ్ళావు, నేను లోపలకు వెళ్ళాను, ఇద్దరికీ అదే తేడా అన్నారు. ఆయన ఋషికింద మాట్లాడలేదు. మూడవ తరగతిలో ఎలా మాట్లాడేవారో అలాగే నేచురల్‌గా మాట్లాడారు. భగవాన్ సహజంగానే ఉండేవారు. భగవాన్‌ది సహజ సమాధి. కళ్ళు మూసుకోవటం, తెరవటం ఏమీ ఉండదు. నేచురల్‌గా,

నార్మల్‌గా ఉంటారు. మీరు ఎక్కువసేపు మాతోనే ఉంటున్నారు, మీరు లోపలకు వెళ్లండి అని కొంతమంది భగవాన్‌తో అనేవారు. మీరు ఇప్పుడు నన్ను లోపలకు వెళ్లమంటున్నారు యిప్పుడు నేను బయట ఉన్నానా అనేవారు. లోపల బయట అంటూ ఏమీ లేదు. దేహబుద్ధి ఉన్న ప్రతీవాడికి లోపల, బయట ఉంటుంది. దేహబుద్ధి లేనివాడికి లోపలలేదు, బయటలేదు. యిప్పుడు నువ్వు ఎక్కడ ఉన్నాను అనుకొంటున్నావు. లోపల ఉన్నాను అనుకొంటున్నావు, దీనికి దేహబుద్ధి కారణం. దేహబుద్ధి లేదు అనుకో లోపల లేదు, బయట లేదు. దేహబుద్ధి ఉన్న ప్రతీవాడికీ లోపల, బయట ఉంటుంది. దేహబుద్ధి నశిస్తే లోపల లేదు బయట లేదు. రామకృష్ణుడు లోపల ఆయన ఒక్కడే ఉన్నప్పుడు ఒకోసారి నేకెడ్‌గా కూర్చొనేవాడు. ఎవరయినా వస్తే తుండు చుట్టుకొని ఆయనే బయటకు వచ్చేవాడు. M వస్తేమటుకు వాడికి నాకు బట్టలు అడ్డు అక్కర లేదు, లోపలకు రమ్మని చెప్పేవాడు. M అంటే ఎలా హత్తుకుపోయాడు అంటే నా బట్టలు నువ్వై ఉన్నావు, నీ బట్టలు నేనై ఉన్నాను. ఇంక నీకు నాకు లోపల ఏమిటి అనేవాడు రామకృష్ణుడు. M ఒక్కడికే రామకృష్ణుడితో ఆ చనువు ఉండేది.

ఈ పని చేస్తే ఈ ఫలితం వస్తుంది, ఆ పని చేస్తే ఆ ఫలితం వస్తుంది అని చెపుతారు కదా. సత్యనారాయణవ్రతం కథలో షావుకారు వ్రతం చేసి ధనవంతుడు అయిపోతాడు కదా. నువ్వు మోహాన్ని దాటితే ఇటువంటి విషయాలు విన్నా నీకు ఏ ఆకర్షణ కలుగదు. నువ్వు మోహంతో ఉన్నప్పుడు సత్యనారాయణవ్రతం చేసుకుంటే నేను కూడా ధనవంతుడిని అయిపోతాను అని నీకు అనిపిస్తుంది. అది మోహం యొక్క వికారం. అది నిజం అని కాదు. ఒకవేళ మీరు ధనవంతులు అయినా అది ఎంతవరకు నిజం. ధనం ఉండగా మీరు అయినా పోవచ్చు, మీరు ఉండగా ధనం అయినా పోవచ్చు. ఒకవేళ యిటువంటి కథలు నిజం అనుకొన్నా నీ బుద్ధి మోహాన్ని దాటితే ఇటువంటి విషయాలు విన్నా నీకు ఏమీ ఆకర్షణ కలుగదు. ఈ కథ రామకృష్ణుడు విన్నాడు అనుకో, ఆయనకు ఏమయినా ఆకర్షణ ఉంటుందా? ఆయన సత్యనారాయణవ్రతం చేసుకొందాము అనుకొంటాడా? ఆయనకు ఆకర్షణ ఏమీ ఉండదు. మీ బుద్ధి మోహంలో ఉన్నప్పుడు ఇదంతా నిజం అనిపిస్తుంది. మీ బుద్ధి కనుక మోహాన్ని దాటితే ఇటువంటి కథలు విన్నా వాటి ప్రభావం మీ మీద ఏమీ ఉండదు. వారు మంచివారు, వీరు చెడ్డవారు అని ఇలా మనం అనుకొంటాము కదా. మోహం దాటినవాడు అలా కూడా

అనుకోడు. ఎందుచేతనంటే అవి వాసనలు. మంచివాడు ఎప్పుడూ మంచివాడిగా ఉండకపోవచ్చు, చెడ్డవాడు ఎప్పుడూ చెడ్డవాడుగా ఉండకపోవచ్చు. వాసనలు మారినప్పుడు మనిషి మారిపోతూ ఉంటాడు. బుద్ధి కనుక మోహాన్ని దాటితే వాడు మంచివాడని, వీడు చెడ్డవాడని ఆ విభజన కూడా వాడికి ఉండదు. ఎందుచేతనంటే వాడిలో ఉన్న స్వరూపాన్నే ఎదుటి మనిషిలో కూడా చూస్తూ ఉంటాడు, అంతకంటే భిన్నంగా అక్కడ ఏమీ కనబడదు.

ఒకో దేహానికి ఒకో రకమైన ప్రారబ్దం ఉంటుంది. ఈ మధ్యన నాకు జ్ఞాపకశక్తి తగ్గిపోతోంది. జ్ఞాపకశక్తి తగ్గుతూ ఉంటే నాకేమి అనిపిస్తోంది అంటే ఇది మన దేహప్రారబ్దం, అనుభవిస్తే పోతుంది కదా అనిపిస్తోంది. కాని భగవాన్ అనుగ్రహం వలన ఈ శరీరం ఉన్నా, ఊడిపోయినా ఒక్కటే అనే భావన నాకు వచ్చేసింది. ఈ శరీరం ఉండటం వలన లాభంలేదు, ఇది పోవటం వలన వచ్చే నష్టంలేదు అని నాకు అనిపిస్తోంది. కానీ శరీరం పోవటం అనేది మన యిష్టం కాదు, శరీరంలో ప్రాణం పోసిన వాడి యిష్టం. ఇవన్నీ బొమ్మలే కదా. ఈ బొమ్మలకు వాడు ప్రాణం పోస్తాడు, మరల వాడు తీసేవరకు మనం ఓపిక పట్టాలి. ఈ లోపు మనం చిరాకు పడటం కంటే దేహప్రారబ్దం అనుభవించేయటమే మంచిది. భగవాన్‌కు కేన్సర్ వచ్చింది. వారేదో పనిమీద వచ్చారు, పని చూసుకొని పోతారు అనేవారు భగవాన్. ఆచార్యులవారు ఏమన్నారు అంటే దేహప్రారబ్దాన్ని మీరు యిష్టంగా అనుభవిస్తే రాబోయే జన్మలలో ఇటువంటి ప్రారబ్దం రాదు. ఒకవేళ మీరు యిష్టం లేకుండా కనుక అనుభవిస్తే మరల ఈ ప్రారబ్దమే రాబోయే జన్మలలో మీకు ఎదురవుతుంది అని చెప్పారు. దేహప్రారబ్దాన్ని యిష్టంతో అనుభవిస్తే అది వదిలిపోతుంది, యింకో ఛాయిస్ లేదు. రామకృష్ణుడు వాళ్ళు పరమ పవిత్రులు. వారికి కేన్సర్ ఏమిటి, అది ఆ దేహప్రారబ్దం అంతే. దేహప్రారబ్దాన్నిబట్టి ఒకోసారి సుఖం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది. దుఃఖం రాకముందు మీ మనస్సు ఎలా ఉందో దుఃఖం వచ్చాక కూడా మీ మనస్సు అలాగే ఉండాలి. అంటే మీ మనస్సు సమానంగా ఉండేలాగ మీరు చూసుకోవాలి. ఇప్పుడు దుఃఖం వచ్చింది ఏమిటి అని మీ మనస్సులో వికారం రాకూడదు. మేము సుఖంగా ఉండాలి, సుఖంగా ఉండాలి అని చాలామంది అనుకొంటారు. అసలు సుఖం అనేది బయట ఎక్కడా లేదు, సుఖం నీ హృదయంలోనే ఉంది. నీ స్వరూపమే సుఖం. బయట సుఖం ఉందని అనుకొన్నంతకాలం సుఖం కోసం నీ మనస్సు బయట వెతుకుతూ ఉంటుంది. నీకు ఏ వస్తువు అయితే లేదో అది

వస్తే సుఖం వచ్చేస్తుంది అని నీకు అనిపిస్తుంది. అది వచ్చాక అందులో కూడా సుఖం లేదని అప్పుడు నీకు తెలుస్తుంది. నీ స్వరూపంలో ఉన్నది సుఖమే కదా యింక బయట నుండి సప్లయి నీకు అక్కరలేదు.

రాగము, భయము, క్రోధము ఈ మూడింటిని విడిచిపెట్టమని పరమాత్మ చెపుతున్నాడు. నీకు రాగం ఉన్నా దుఃఖం వస్తుంది, భయం ఉన్నా దుఃఖం వస్తుంది, కోపం ఉన్నా దుఃఖం వస్తుంది. రాగము, భయము క్రోధము ఈ మూడింటిలో ఏది ఉన్నా ఏదో రూపంలోనీకు దుఃఖం వచ్చేస్తుంది. ఈ మూడు దుఃఖకారణాలు కాబట్టి వాటిని విడిచిపెట్టు. నీ డ్యూటీ ఏదో నువ్వు చెయ్యి, ఎక్కడా ఎటాచ్‌మెంట్ పెట్టుకోవద్దు. సేవ చెయ్యటం వలన కూడా మనస్సు పవిత్రం అవుతుంది. ముసలివాళ్లకు సేవ చెయ్యాలి, అంటే మనకు సహనం ఉండాలి. శాస్త్రంలో ఒక మాట ఉంది. వృద్ధులకు, మంచం పట్టిన వారికి, వాళ్లంతట వాళ్ళు మేనేజ్ చేసుకోలేని వారికి సేవచేస్తే దానివలన కూడా జ్ఞానం వచ్చే అవకాశం ఉంది. అంటే నీలో ఉన్న సేవాభావానికి బహుమానంగా భగవంతుడు నీకు జ్ఞానాన్ని యిస్తాడు. వృద్ధులకు సేవచేసేటప్పుడు కూడా కొంతమంది పది పైసలు సేవచేసి యాభై పైసలు వారిని తిడతారు. అటువంటి సేవవలన ఏమీ ప్రయోజనం లేదు. పూర్వజన్మల్లో జరిగిన సంఘటనలను బట్టి నీకు మంచి ఎదురవుతుంది, చెడూ ఎదురవుతుంది. అంటే పూర్వజన్మల్లో నువ్వు చేసింది అది ఖర్చు అయిపోవటానికి ప్రారబ్దంలో మంచి చెడ్డల రూపంలో నీకు ఎదురవుతాయి. అప్పుడు నీకు గౌరవం వచ్చినా, అగౌరవం వచ్చినా ఏది వచ్చినా నీ మనస్సులో చాపల్యం లేకుండా నువ్వు స్థిరంగా ఉండగలగాలి. మీరు బాహ్యంగా సాధనలు చేయటం వలన కొన్ని వాసనలు అణిగి ఉన్నా విషయవాసనలు పూర్తిగా నశించాలి. పరమాత్మ దర్శనం వలన మాత్రమే, నీ హృదయంలో ఉన్న చైతన్యాన్ని నువ్వు అనుభవైకవేద్యం చేసుకోవటం వలన మాత్రమే, అంటే నీకు దేహబుద్ధి పూర్తిగా నశించి ఆత్మబుద్ధి కలిగినప్పుడు మాత్రమే లోపల బీజరూపంలో ఉన్న వాసనలు అన్నీ కూడా పూర్తిగా కాలిబూడిద అయిపోతాయి. లోపల ఉన్న అంతర్యామి దర్శనం అవ్వటానికి ఆయన యొక్క అనుగ్రహం లేకుండా అది సాధ్యంకాదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి.

నేను అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి ఆ దేహాలను వాటి యొక్క ప్రారబ్దాన్ని

అనుసరించి నడిపిస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. ఇది ఒక్కటే సత్యం. మిగతా విషయాలు అన్నీ వ్యవహారిక సత్యాలు. అవి ఒక కాలంలో వస్తాయి, యింకో కాలంలో పోతూ ఉంటాయి. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు ఎక్కడో లేడు, మన హృదయంలోనే అంతర్యామిగా ఉన్నాడు. ఎవడి మనస్సు అయితే అంతర్ముఖమయ్యిందో వాడికి హృదయంలో ఉన్న అందాలు తెలుస్తాయి. పైకి వెళ్ళటం తేలిక, లోపలకు దిగటం చాలా కష్టం. మనస్సును డిఫెన్ చెయ్యటం చాలా కష్టం. మనస్సు అంతర్ముఖం అయితే కాని నీకు సత్యానుభవం కలుగదు. దానికి నీకు తూకం పెరగాలి. తూకం పెరగాలి అంటే నీకు సహనం ఉండాలి. సహనం లేకుండా ఏ మనిషికి తూకం పెరగదు. సహనం, శ్రద్ధ ఈ రెండు మాటలే షిరిడీ బాబాగారు జీవితం పొడుగునా చెప్పారు. ఈ రెండు మర్చిపోకుండా మీరు జీవితం పొడుగునా ప్రాక్టీసు చెయ్యండి. ఏదో వారు తిట్టారు, నేను కూడా తిట్టేసి వచ్చేసాను అని ఇటువంటి గొడవలు వద్దు. కొంతమంది ప్రతీవిషయానికి ఉద్రేకపడతారు. JKగారు ఏమని చెప్పారంటే మనుషులు రకరకాలుగా యాక్ట్ చేస్తారు. వాళ్ళ యాక్షన్ నీకు బాగోకపోయినా నువ్వు తొందరపడి రియాక్ట్ అయిపోవద్దు, అప్పుడు కొంచెం సహనంగా ఉండాలి అని చెప్పారు. మీ కంటే పెద్దవాళ్ళు మిమ్మల్ని మాటవరసకు ఏదయినా అన్నారు అనుకోండి, ఏదో వాళ్ళు అన్నారని, మీరు అనేయటం కాదు. వాళ్ళ వయస్సును కొంత చూసుకోవాలి. వాళ్ళు చిన్నవాళ్ళు మనం పెద్దవాళ్ళం అనుకొని దానిని బట్టి ఏదో ఒకటి అంటారు. ఒకవేళ వాళ్ళు ఏదయినా పొరపాటు మాట మాట్లాడినా మీరు తొందరగా రియాక్టు అయిపోకూడదు. మనం సరిపెట్టుకొంటే పోతుంది. మనం కంగారుపడి తిరిగి ఏదయినా అంటే వాళ్ళు బాధపడతారు. వాళ్ళు వయస్సును బట్టి పెద్దరికం ఫీల్ అవుతారు. మన దగ్గరనుండి గౌరవం ఆశిస్తారు. వాళ్ళను గౌరవించటం వలన మనకు వచ్చే నష్టం ఏమిటి. సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు. అందుచేత మీరు సరిపెట్టుకొంటూ ఉండాలి. కొంతమంది పెత్తందార్లు ఉంటారు. అవసరం లేకపోయినా ఏదో ఒకటి అంటారు, అది వారికి అలవాటు అయిపోతుంది. పెద్దరికం కోసం అలా మాట్లాడతారు. అది కూడా మనం సరిపెట్టుకోవాలి. ప్రతీచిన్న విషయానికి రియాక్టు అవ్వవద్దు అని JKగారు చెపుతున్నారు. అందుచేత మనం కొంచెం సహనంగా ఉండాలి.

నువ్వు ఎంత పండితుడు అయినా యింద్రియాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

ఎందుచేతనంటే నువ్వు అజాగ్రత్తగా ఉంటే యింద్రియాలు నిన్ను బహిర్ముఖం చేసేస్తాయి. నువ్వు అలా ప్రశాంతంగా కూర్చొన్నావు అనుకో. నీకు ఏదో తలంపు వస్తోంది కదా. మీ మనస్సులో అసలు తలంపు పుట్టటానికి కారణం ఏమిటి? నీ మనస్సులో ఏదో దోషం ఉంది కాబట్టి నీకు తలంపు వస్తోంది. ఆ దోషమే తలంపు రూపంలో వస్తోంది. తలంపు వచ్చాక నువ్వు ఆ విషయాన్ని ధ్యానిస్తావు. అప్పుడు ఆ విషయం నిన్ను ఆకర్షిస్తుంది. ఆ విషయం నిన్ను ఆకర్షించాక నీకు కోరిక పుడుతుంది. ఆ కోరిక భంగమయితే, భంగమయిన కోరికే కోపంగా మారిపోతుంది. కోపం ఎక్కువగా వచ్చినప్పుడు అవివేకం ఆవరిస్తుంది. మీరు కోపంగా ఉన్నప్పుడు ఆలోచించవద్దు. అప్పుడు మీరు లోతుగా ఆలోచించలేరు, తెలివితేటలుగా ఆలోచించలేరు. ఎప్పుడయినా కోపం వచ్చినప్పుడు ఆ పది నిమిషాలు ఏమీ మాట్లాడకుండా ఊరుకోవటం మంచిది. కోపం పెరిగే కొలదీ వివేకం తగ్గిపోతుంది. వివేకం తగ్గిపోతూ ఉంటే మతిభ్రమ వస్తుంది. అప్పుడు మనం ఏది స్వీకరించాలి, ఏది విడిచిపెట్టేయాలి అనే డిస్క్రిమినేషన్ కూడా పోతుంది అంటే ఏది మనకు ఉపయోగపడుతుంది, ఏది మనకు ఉపయోగపడదు అని బుద్ధి విభజన చేయలేదు. నువ్వు బుద్ధిని కాపాడుకోవాలి. నీ బుద్ధి కనుక పాడయిపోతే నీకు ఎన్ని ఉన్నా ఏమీ ప్రయోజనం లేదు. నీ బుద్ధి నిర్మలంగా ఉండాలి, ప్రశాంతంగా ఉండాలి. నీ బిహేవియర్‌ను జాగ్రత్తగా బేలెన్స్ చేసుకో. ఎవరో ఏదో అన్నారని ఆ మాటకు మాట అప్పగించేయాలని అనుకోవద్దు. ఇంట్లో రోజూ జరిగే గొడవలు చాలా ఉంటాయి. ప్రతీ విషయానికి రియాక్టు అయిపోయి ఆరోగ్యం చెడగొట్టుకోవద్దు. శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో. పరమాత్మ చింతన లేకుండా నిరంతరం విషయాలను చింతించటమే పనిగా పెట్టుకొంటే చివరకు అది బుద్ధి నాశనానికి దారి తీస్తుంది.

గాంధీగారు భగవద్గీతను భగవద్గీత అని పిలిచేవారు కాదు, మా మదర్ అనేవారు. మన పూర్వపు ఋషులు గాని, ఎవరు ఏ మహాత్ముడు చెప్పినా వాళ్ళు చెప్పింది భగవద్గీతలో ఉండాలి. వారు చెప్పే మాటలు దానికి అనుగుణంగా ఉండాలి. అనుగుణంగా ఉంటేనే వాటిని మనం అంగీకరించాలి. వారు చెప్పేమాటలు భగవద్గీతతో సంబంధం లేకుండా ఉంటే వాటిని మనం తీసుకోనక్కరలేదు. మనం ఏ పని చెయ్యాలి, ఏ పని చెయ్యకూడదు, ఏ పని చేస్తే దాని పరిణామం ఎలా ఉంటుంది అని శాస్త్రం నిర్దేశించింది. ఇది నిషేధం అని శాస్త్రం

చెప్పినప్పుడు అది నీకు ఆకర్షణగా కనిపించినా దాని జోలికి వెళ్ళకూడదు. ఏది చెయ్యాలి, ఏది చెయ్యకూడదు అనే విషయంలో ఎవరు ప్రమాణం అంటే శాస్త్రమే మనకు ప్రమాణం. కొంతమంది మంచి పనులు చేస్తారు అదే మంచిపనులు మనం చేయలేకపోవచ్చు. కానీ చూసి సంతోషించాలి. సంతోషించటానికి అభ్యంతరం ఉండనక్కరలేదు. సంతోషించటానికి మనకు అభ్యంతరం ఉంటే మనలో ఏదో దోషం ఉన్నట్లు గుర్తు.

మీకు యిష్టాలు, అయిష్టాలు లేకపోతే ఏ గొడవలేదు. ఒకవేళ యిష్టాలు, అయిష్టాలు ఉంటే తగ్గించుకోండి. యిష్టాలు, అయిష్టాలు ఎందుకు తగ్గించుకోమని చెపుతున్నాడు అంటే వాటి వలన మనస్సు బాహ్యముఖానికి పోతుంది, వాటివలన మన మనస్సు పాడవుతుంది. యిష్టం, అయిష్టం కూడా మీకు దుఃఖాన్ని తీసుకొని వస్తుంది. అందుచేత మీలో యిష్టాలు, అయిష్టాలు ఉన్నాయేమో చూసుకోండి, ఉంటే వాటిని తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయండి. లోపల యిష్టాలు, అయిష్టాలు లేనివాడికి, ప్రయత్నం చేసి కామక్రోధముల నుండి విడుదల పొందినవాడికి ఈ శరీరం ఉన్నా లేకపోయినా, ఈ ప్రపంచం కనిపిస్తున్నా కనిపించకపోయినా వీటితో సంబంధంలేకుండా వాడికి ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా ఆనందమే, ఎటు చూసినా సుఖమే. ఇది రాత్రి, ఇది పగలు అనే విభజన కూడా వాడికి పోతుంది. అందుచేత నువ్వు కామక్రోధముల నుండి విడుదల పొందితే మోక్షం పొందటానికి నీ శరీరం చనిపోయే వరకు ఆగనక్కరలేదు. నీ శరీరం యొక్క చావుకు, దీనికి ఏమీ సంబంధం లేదు. శరీరం ఉండగానే హద్దులులేని, అంతులేని సుఖాన్ని శాంతిని అనుభవిస్తావు. యితర సుఖాలతో పోల్చటానికి వీలులేని సుఖం, ఇట్టి సుఖం ఈ లోకంలో లేదు అని నీకు ఆశ్చర్యం కలిగేటటువంటి సుఖం ఈ శరీరం ఉండగానే నీకు అనుభవం లోనికి వస్తుంది, నువ్వు ఆనంద సామ్రాజ్యానికి అధిపతివి అవుతావు.

బుద్ధుడిని ఆక్షేపించటానికి బ్రాహ్మణులు ఆయనను ఒరే గుండూ అని పిలిచేవారు. ఆయన చాలా పెద్దవాడు, భౌతికంగా చూసినా చక్రవర్తి కదా అయినా ఎప్పుడూ ఆయన రియాక్టు అవ్వలేదు, చాలా ప్రశాంతంగా ఉండేవాడు. ఇటువంటి విషయాలలో మనకు బుద్ధుడు ఆదర్శం. ఆయన మొఖం చూసేటప్పటికి మనకు శాంతి వచ్చేస్తుంది. ఆయన ఏమీ బోధించకుండా ఆయన మొఖాన్ని చూసి 150మంది జ్ఞానులు అయ్యారు అని చెపుతారు.

అది మామూలుగా మనస్సులోనుండి వచ్చే సుఖం కాదుకదా, అది హృదయాంతరాళాలలో నుండి వచ్చేది. మీకు శరీరం ఉన్నా లేకపోయినా మిమ్మల్ని మధ్యవర్తులతో సంబంధం లేకుండా దుఃఖం లేని స్థితికి డైరెక్టుగా తీసుకొనిపోవటానికి బుద్ధుడు ప్రయత్నంచేసాడు.

మీరు తరించేవరకు కూడా మధ్యేమార్గంలో ప్రయాణం చేయండి, దేనికీ అతిగా వెళ్ళకండి. అంటే మీరు అవలంభించే పద్ధతులు అతిగా ఉండకూడదు. అతిగా ఉంటే మీ ఆరోగ్యం చెడిపోవచ్చు. లేకపోతే కొంతకాలం చేసిన తరువాత ఉత్సాహం తగ్గిపోవచ్చు. అందుచేత మీరు అతిగా ఉండవద్దు. గమ్యస్థానం చేరుకొనేవరకూ మధ్యేమార్గంలోనే ఉండండి. అది సేఫ్‌సైడ్. ఎక్కడా రిస్క్ తీసుకోవద్దు. మీరు తిండి దగ్గర కూడా మధ్యేమార్గం అవలంభించండి. మీరు ఎక్కువ తినవద్దు, తక్కువ తినవద్దు. మీ శరీరానికి ఎంత అవసరమో భోజనం చేసేటప్పుడు మీ శరీరం చెపుతుంది. అలా ఆహారం తీసుకుంటూ మధ్యేమార్గంలో వెళితే మీరు గమ్యానికి చేరుకుంటారు.

నిమిత్తమాత్రం భవసవ్యసాచిన్. ఈ మాటను మీరు బాగా గుర్తు పెట్టుకోండి. ఈ యుద్ధం పేరు చెప్పి నువ్వు నిమిత్తమాత్రంగా ఉండు, పనంతా నేను చేసేస్తాను అని పరమాత్మ చెపుతున్నాడు. భారతదేశంలో జన్మించినటువంటి గొప్పవీరులలో అర్జునుడు ఒకడు. అటువంటి మహావీరుడిని పట్టుకొని నువ్వు నిమిత్తమాత్రం అంటే ఇంక అసలు మన మాట ఏమిటి? నేను అది సాధించాను, ఇది సాధించాను అంటాము ఏమి సాధించినట్లు. భగవంతుడు మనకోసం సాధించిపెట్టిందే మనం సాధించామ అనుకొంటున్నాము అంతే. ఈ మాటలను మీరు తలపెట్టుకొంటూ ఉంటే మీకు ఎంత సంపద ఉన్నా, ఎన్ని తెలివితేటలు ఉన్నా కూడా మీకు గర్వంరాదు. ఇప్పుడు నీ కళ్ళకు సృష్టి కనిపిస్తోంది కదా. నీకు జ్ఞానం కలిగితే నీ కళ్ళకు కనిపించే సృష్టి అంతా కూడా నీ హృదయంలో అణిగిపోతుంది. జ్ఞాని కూడా సృష్టిని చూస్తూ ఉంటాడు. అయితే వాడికి ఆ సృష్టిమీద ఏమీ ఆకర్షణ కలుగదు ఎందుచేతనంటే అక్కడ ఏమీ లేదని వాడికి తెలుస్తూ ఉంటుంది. గాంధీగారు ఒకమాట చెప్పారు. మీరు సాధన చేసేటప్పుడు ఈ ఆధ్యాత్మికమార్గంలో ఏ సందేహం వచ్చినా నువ్వు ఎవరి దగ్గరకు తిరగనక్కరలేదు. భగవద్గీతలో 700శ్లోకాలు ఉన్నాయి. వాటిని రిఫర్ చేసుకో. నీకు వచ్చిన సందేహానికి ఏదో ఒక శ్లోకంలో సమాధానం దొరుకుతుంది అని చెప్పారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-03-2016 , భీమవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జీవితం యొక్క విలువ మనకు తెలియటంలేదు. మనం చేసే కొన్ని పనులు ఎలా ఉంటాయి అంటే అవి మనకీ ఉపయోగపడవు, సమాజానికీ ఉపయోగపడవు. అటువంటి పనులు చేయటం, అనవసరంగా ఇతరులతో ఘర్షణలు పెట్టుకోవటం, యూస్‌లెస్‌గా మాట్లాడటం ఈ రకంగా మనం టైమును వృధా చేసుకొంటున్నాము. మన యింటికి బంధువులు వస్తే రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి వారికి కాఫీ కాసి ఇవ్వటం ఎటువంటిదో మన జీవితాన్ని యిటువంటి చిల్లర విషయాలకు వేస్ట్ చేయటం కూడా అటువంటిదే. మనందరం వయస్సులో ఉండగా మనకు ముసలితనం వస్తుందని మర్చిపోతాము. మన శరీరానికి ముసలితనం వస్తుంది, తరువాత చావు వస్తుంది. ఇవన్నీ సహజంగా వచ్చేస్తాయి. భారతంలో వ్యాసుడు ఏమని చెప్పాడు అంటే నువ్వు పుట్టినరోజునే, చనిపోయేరోజు కూడా నిర్ణయింపబడుతుంది. నువ్వు మొదటిశ్వాస ఎప్పుడయితే తీసుకున్నావో అప్పుడే నువ్వు చివరి శ్వాస ఎప్పుడు తీసుకోవాలో ఈశ్వరుడు నిర్ణయించేస్తాడు. ఈశ్వరనిర్ణయ ప్రకారం నీ శరీరాన్ని ప్రాణం విడిచిపెట్టేస్తుంది. మన శరీరం ఏదో రోజున మరణిస్తుంది అనే విషయం గుర్తు పెట్టుకొంటే జీవితం పట్ల మనం కొంచెం జాగ్రత్తగా ఉంటాము. భగవాన్ ఏమని చెప్పారు అంటే భౌతికంగా నువ్వు ఎవరికో ఉపకారం చేయటం కంటే సత్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా నువ్వు రీలైజ్‌చేయటం వలన, అంటే నువ్వు సత్యానుభవం పొందితే దాని ప్రభావం సమాజం మీద పడి అనేకమంది ఉద్ధరింపబడతారు, నీ ద్వారా సృష్టికి ఎంతో మేలు జరుగుతుంది, నీ ద్వారా సమాజానికి శాంతి, కాంతి ప్రవహిస్తుంది. సమాజం యొక్క చైతన్యస్థాయి పెరుగుతుంది. అంతకంటే సృష్టికి నువ్వు చేసే మహోపకారం ఏముంది. అందుచేత సత్యాన్ని రీలైజ్ చెయ్యి. ఈ సృష్టికి ఎవ్వరు చెయ్యని ఉపకారం నీ ద్వారా జరుగుతుంది. ఇవి ప్రకృతి రహస్యాలు. ఇటువంటి రహస్యాలను వెలుగులోనికి తీసుకొని వచ్చారు భగవాన్. హృదయంలో ఉన్న శాంతిని ఆయన అనుభవించి దాని ప్రభావం యితరుల మీద ఎలా పడుతుందో మన అందరికీ అర్థమయ్యే లాగ చెప్పారు భగవాన్.

జ్ఞాని యొక్క ప్రభావం భక్తుని హృదయంలో మౌనంగా ప్రవేశిస్తుంది. ఫ్యాను స్పీడుగా

తిరిగేటప్పుడు దాని ఆకులు కనబడవు, తిరిగినట్లు కనబడదు, నీకు గాలి వస్తూ ఉంటుంది. జ్ఞాని చేసే పని అలా ఉంటుంది. ఆయన చేస్తున్నట్లు కనబడదు. ఆ డివైన్ ఇంటర్‌ఫియరెన్స్ నీ జీవితంలో ఎలా ప్రవేశిస్తుందో తెలియదు. అది ఈశ్వరుడు నిర్ణయించుకొంటాడు. భగవాన్‌ది 100% ఇంఫెర్సనల్ లైఫ్. ఉదాహరణకు మీ అనుగ్రహం నాకు కావాలి అని అడిగితే ఎవడయితే నన్ను అనుగ్రహించాడో వాడే మిమ్మల్నీ అనుగ్రహిస్తాడు. నన్ను అనుగ్రహించినవాడు వేరు, మిమ్మల్ని అనుగ్రహించేవాడు వేరు కాదు. ఉన్నది ఒక్కటే అనే వారు భగవాన్. అనుగ్రహం అన్నా, ఈశ్వరుడు అన్నా ఇవన్నీ పర్యాయపదాలు ఎక్కడ గురువు ఉంటే అక్కడ అనుగ్రహం ఉంటుంది, ఎక్కడ ఈశ్వరుడు ఉంటే అక్కడ అనుగ్రహం ఉంటుంది. అసత్యానికి ప్రచారం కావాలికానీ సత్యానికి ప్రచారం ఏమీ అక్కరలేదు. జ్ఞాని చేసేపని మౌనంగానే చేస్తాడు. ఆయన నీకు ఏదయినా సహాయం చేసినా నీ ప్రక్కన కూర్చున్నా వాళ్ళకు కూడా తెలియకుండా చేస్తాడు. ఇతరులకు తెలియాలి అనుకోవటం వలన వ్యక్తి భావన పెరుగుతుంది, దేహబుద్ధి పెరిగిపోతుంది, పునర్జన్మ కారణాలు కూడా పెరిగిపోతాయి.

ఈ లోకాన్ని ఎంజాయిచెయ్యాలి అని చాలామంది అనుకొంటారు. ఎంజాయ్‌మెంట్‌లో ఏమీలేదు. ఈ లోకాన్ని ఎంజాయ్‌చెయ్యాలి అనుకోవటం పెద్దబంధం. లోకాన్ని ఎంజాయ్‌చెయ్యాలి అనేబుద్ధి మీకు ఉన్నంతకాలం పునర్జన్మ రాకుండా ఎవరికీ ఆగదు. స్వప్నంలో కూడా ఎప్పుడూ ఈ లోకాన్ని ఎంజాయ్ చెయ్యలేదు అని రామకృష్ణుడు చెప్పాడు. భగవాన్‌ది నోమైండ్ స్టేట్, నో వరల్డ్. చాలామంది భక్తులు కూడా అద్వైతులే. ప్రహ్లాదుడు గొప్ప భక్తుడు అని చెపుతారు. ఆయన ఎంత భక్తుడో అంత అద్వైతి. ఆయన ద్వితీయం ఎక్కడా చూడలేదు. పాముల చేత కరిపించినా, ఏనుగుల చేత తొక్కించినా, ఎన్ని పనులు చేసినా ప్రశాంతంగా ఉన్నాడు. ఎందుకు అలా ఉండగలిగాడు అంటే ఆయనలో ద్వైతభావన లేదు. ద్వైతభావన ఉన్నప్పడే మనకు భయం వస్తుంది.

ఆచార్యులవారు ఏమంటున్నారు అంటే నువ్వు వయస్సులో ఉన్నప్పడే ఏమీ సాధన చేయలేక పోతున్నావు, ఇంక మంచం పట్టాక ఏమి సాధన చేస్తావు అంటున్నారు. సర్వసాధారణంగా మనలో ఒక బలహీనత ఉంటుంది. ప్రతీ విషయానికి రేపు రేపు అంటాము. మనకు ఏదయినా చెడు తలంపువస్తే ఎప్పడూ దానికి వాయిదా వేసుకోవాలి. అలా చేయటం వలన నెమ్మదిగా దానిని మర్చిపోతాము. మనకు మంచి తలంపు వస్తే వాయిదా వేయకూడదు,

మంచి తలంపులు వచ్చినప్పుడు వాటిని వెంటనే అమలు జరపాలి, వాయిదా వేస్తే రేపటికి మన బుద్ధి ఎలా ఉంటుందో చెప్పలేము. మహాత్ములతో సన్నిహితంగా ఉండడంవలన వారి ప్రభావం మన మీద పడుతుంది. మీరు ప్రాక్టికల్‌గా చేసి చూడండి. మీకు ఎప్పుడయినా అశాంతి వస్తోంది అనుకోండి, ఒక మహాత్ముడి దగ్గరకు వెళ్ళి కూర్చొంటే వారి వైబ్రేషన్స్ మన మీద పడి మనకు శాంతి కలుగుతుంది. అంటే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందుతారు. మీరు పెద్ద కష్టపడకుండా ఎక్కువ బెనిఫిట్ పొందుతారు. అందుచేత హోలీ కంపెనీ అవసరం. మనం చేసే సాధనలు ఫాన్‌లవంటివి. నాచురల్‌గా మనకు గాలి వస్తూ ఉంటే ఇంక టేబుల్‌ఫాన్, సీలింగ్‌ఫాన్ అవసరం లేదు. హోలీ కంపెనీ నేచరల్‌గా వచ్చేగాలి వంటిది. పరమపవిత్రుల తోటి, యోగులతోటి నీకు సహవాసం కుదిరితే నువ్వు పెద్ద సాధనలు చెయ్యనక్కరలేకుండా వారి ప్రభావం వలన నీ మనస్సు హృదయం యొక్క లోయల లోనికి జారుకొంటుంది.

చింతా దీక్షితులు గారు, చలం గారు ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్‌లో పనిచేసేవారు. దీక్షితులు గారికి భగవాన్ అంటే యిష్టం, భగవాన్ దగ్గరకు ఎక్కువగా వెళ్ళేవారు. ఒకసారి దీక్షితులుగారు అరుణాచలం వెళుతూ కంపెనీ కోసం చలంగారిని ఆయనతో రమ్మని అడిగారు. సరే నేను నమస్కారం పెట్టను వస్తాను అని చెప్పారు. తిరిగివచ్చేటప్పుడు నువ్వు చెపితే చెప్ప నేను చెప్పను అన్నారు చలం గారు. అయితే నువ్వు ఇక్కడే ఉండు నేను చెప్పేసి వస్తాను అన్నారు దీక్షితులుగారు. ఆయన చెపుతూ ఉంటే చలంగారు కూడా అక్కడకు వచ్చారు. ఈ రోజు మేము బయలుదేరి వెళ్ళిపోతున్నాము అని దీక్షితులు గారు భగవాన్‌తో చెప్పారు. భగవాన్ ముందుకు వచ్చేస్తూ ఉంటే నేనుకూడా ఈ రోజు వెళ్ళిపోతున్నాను అని చలంగారు వెనకాల నుండి భగవాన్‌తో అన్నారు. భగవాన్ మొత్తం శరీరం అంతా వెనక్కి తిప్పారు. చలంగారు పరమ నాస్థికులు. పూర్వపు ఋషులు అందరూ మన సమాజాన్ని పాడుచేసారని వారిని తిడుతూ పుస్తకాలు వ్రాసారు. భగవాన్‌తో పరిచయం లేనప్పుడు ఆయన రచనలు అలా ఉండేవి. భగవాన్ శరీరం అంతా తిప్పి చలంగారి కళ్ళలోకి డీప్‌గా చూసారు. అంతే ఆయన నాస్థికత్వం అంతా పోయింది, ఆ చూపుతో ఆయనలో ఉన్న పెంట అంతా కాలి బూడిద అయిపోయింది. భగవాన్ శరీరం విడిచిపెట్టిన తరువాత కూడా ఆయన చాలాకాలం అరుణాచలంలోనే ఉన్నారు, అరుణాచలం విడిచిపెట్టి ఎక్కడికి వెళ్ళలేదు. ఆ రోజునుండి

ఆయన ఏది మాట్లాడిని భగవాన్ గురించే మాట్లాడటం, ఏదయినా వ్రాస్తే భగవాన్ గురించి వ్రాయటం, ఆలోచిస్తే భగవాన్ గురించి ఆలోచించటం. ఆ రోజునుండి ఆయన ఆస్థికుడు అయిపోయాడు.

జ్ఞానం వచ్చాక అంతా ఒక్కటే. ఇన్ని రకాల జ్ఞానులు ఉండరు. సబ్జక్టు ప్రజంటేషన్‌లో తేడా ఉండవచ్చు. లోపల ఉన్న శక్తి ఒకే రకంగా ఉంటుంది. మీరూ జ్ఞానే, రమణభగవాన్ జ్ఞానే మీకు ఆయనకు తేడా ఏమిటి అని కంచి పరమాచార్యను ఒకరు అడిగారు. ఆయన ఏమన్నారు అంటే తేడా మాట తరువాత చూద్దాము. అసలు ఇద్దరు జ్ఞానులు ఉంటారా, యిది ఎక్కడా నేను వినలేదు. జ్ఞానం అనేది ఒక్కటిగానే ఉంటుంది కానీ రెండుగా ఉండదు. రెండుగా ఉంటే అది జ్ఞానం ఎలా అవుతుంది. మీ మనస్సు నశించాలి అంటే, నువ్వు జీవన్ముక్త స్థితిని పొందాలి అంటే ఉన్నది నలుబది సద్విద్య బాగా చదవాలి, మీరు దానిని రిపీటెడ్‌గా నెమ్మదిగా చదవండి. అందులోని ప్రతీవాక్యాన్ని ధ్యానం చెయ్యాలి. అలా చేయటం వలన మీ మనస్సు అణిగిపోతుంది. ఉన్నది నలుబది సద్విద్యలో ఆ విశేషం ఉంది. మౌనం కూడా ఉపదేశమే, అది పరిపూర్ణమైన ఉపదేశం. అందులోనుండి వచ్చే ఉపదేశం మీకు అందదు, లోపల ఎంతో బాగా వికసించిన జీవకోటికి గాని అది అవగాహనలోకి రాదు. ఒకసారి బుద్ధుడు చెట్టుకింద కూర్చుని టీచ్ చేస్తున్నాడు. అక్కడ పదిమంది కూర్చొన్నారు. అందులో ఆరుగురు పరధ్యానంలో ఉన్నారు, నలుగురు శ్రద్ధగా వింటున్నారు. అందులో ఒకడు లేచి బుద్ధుడిని అడిగాడు, ఏమండీ ఆరుగురు పరధ్యానంగా వింటున్నారు. మీరు చెప్పే సబ్జక్టు వాళ్లకు, మాకూ ఒక్కటే దానికి కారణం ఏమిటి అని అడిగాడు. అంటే యిమేటియేట్ రిప్లై వాళ్ల పూర్వజన్మ సంస్కారాలు విననివ్వటం లేదు అని చెప్పాడు. వారికి వినాలనే ఉంది కానీ ఆ వాసనలయొక్క వేగం, తలంపుల యొక్క వేగం, అలవాట్లు యొక్క వేగం వారిని విననివ్వదు అన్నాడు. చూపుకు కూడా పరిశుద్ధ పరిచే శక్తి ఉంది అంటే నీ మనస్సు పవిత్రం అవ్వటానికి జ్ఞాని యొక్క చూపు సహకరిస్తుంది. రామాయణంలో వాల్మీకి ఒకమాట చెప్పాడు. నువ్వు రాముడిని చూడటం కాదు, రాముడి చేత నువ్వు చూడబడాలి అని చెప్పాడు. జ్ఞానియొక్క చూపు నీమీద పడితే నీ మనస్సుయొక్క వాండరింగ్ అంతా ఆగిపోతుంది. మహాత్ముల సన్నిధిలో అక్కడ మానసిక వాతావరణం అంతా మారిపోతుంది. మారిపోయిన వాతావరణం జ్ఞానసముపార్జనకు నీకు సహకరిస్తుంది.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# చిత్తశోధకం

"చిత్త శోధకం ముక్తి సాధకం" అన్నారు భగవాన్ శ్రీరమణమహర్షి. ఆత్మజ్ఞాన సముపార్జనలో మనస్సును పరిశుద్ధం చేసుకొని, ఎవరిని వారు పవిత్రునిగా చేసుకొనవలసియున్నది. సమస్త వికారాలకు, దోషాలకు, దుఃఖానికి, బలహీనతలకు, దేహాత్మబుద్ధే కారణం. దేహేంద్రియ మనోబుద్ధులే 'నేను' అనెడి దృష్టిని కల్పించే అజ్ఞానమే బలహీనత. విషయచింతన బలముగా ఉండే, స్వరూప చింతనకు దూరమవుతాము. విధి, నిషేధముల సమన్వయమే ఆధ్యాత్మిక మార్గంలో కీలకం. వదలవలసింది వదలడం ఎంతముఖ్యమో, పట్టుకోవలసింది పట్టుకోవడం కూడా అంతే ముఖ్యం. కాబట్టి మన సాధనకు వివేకాన్ని జోడించాలి. నిరంతర విచారణవల్ల, సత్సంగంవల్ల, మనస్సు బలహీన పడుతుంది. వాసనాక్షయం ముఖ్యం. మనలోని వాసనలు, కోరికలు స్వరూపాన్ని గుర్తించకుండా చేస్తున్నాయి. మనోనాశము గమ్యము కాబట్టి, దాని కొరకై తగిన సాధన చెయ్యాలి. ఆత్మన్యూనతాభావము, ప్రతికూల ఆలోచనలను విడిచిపెట్టాలి. వ్యర్థమైన మాటలు, ఆలోచనలు, పనులతో కాలమును పాడుచేసుకోకూడదు. మిధ్యానేను కల్పించే విషయాలను కాకుండా, హృదయంలో స్వరూపంగా ఉన్న పరమాత్మను చింతించాలి. పరమపవిత్రులకు, మోహము నుండి విడుదల పొందిన వారికి మాత్రమే వాస్తవంగా తాను ఎవరో? అనుభవంలోకి వస్తుంది. సృష్టి సకలమును ఆత్మస్వరూపంగా భావించాలి. అద్వయ సచ్చిదానంద స్వరూప ఆత్మయందు మనస్సును నిలకడ చెయ్యాలి. త్రికరణాలను శుద్ధిగా ఉంచుకోవాలి. ఒక మహాసముద్రములోని ప్రతినీటిబుడగకు, ప్రతి కెరటానికి, మహాసముద్రమే ఆధారమైనట్లు, మన సమస్తదేహాలకు, సమస్త సృష్టికి బ్రహ్మమే ఆధారముగా ఉన్నది. ఉన్నది కేవలం ఒక్కటే! అనేక రూపాలలో కనిపిస్తోంది. పరమాత్మ అంతటా ఉన్నాడు, కాబట్టి మన హృదయంలోనూ ఉన్నాడు. దేహాత్మ భావన వల్ల అనంతమైన ఆత్మకు పరిమితత్త్వం ఆపాదించబడుతోంది. ఆత్మభావనవల్ల పరిమిత బుద్ధి నుండి అనంతత్త్వంలోకి వస్తాం. హృదయంలో స్వరూపంగా ఉన్న చైతన్యం 'తానుగా' అనుభవైక వేద్యం కావాలంటే గురుకృప అత్యంత కీలకం. మనతో సంచరించే రూపుదాల్చిన సత్యమే గురువు. గురువు మాత్రమే మనకు నిజమైన ఆప్తుడు, మార్గదర్శకుడు.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిజమైన సౌందర్యం హృదయపవిత్రతలోనే ప్రకాశిస్తుంది.

సచ్ఛీలం నిజమైన అందం. శరీరం రంగు బంగారంలా ఉన్నా అది మట్టే నశించిపోతుంది. ఇందుల్లోగల సూక్ష్మశరీరం సంస్కారాలను పోగుజేసుకొంటూ పెరుగుతుంది. శరీరం పనికిమాలింది. ఇంద్రియసంబంధమైన వికారాలకు లోబడుతుంది. ఆత్మ శాశ్వతం కానిదాన్ని గురించి పట్టించుకోలేనివాడు జన్మచక్రంలో తిరుగుతూ ఉంటాడు. చిత్తమునకు వీడ్కోలు చెప్పి ఆత్మ సమర్పణ చేసేవాడికి మరణంలేదు. కటికచీకటిలో చిన్న కొవ్వొత్తి కాంతి ఎంతో దూరం ప్రసరిస్తుందో అలాగే మిక్కిలి దుర్మార్గమైన ప్రపంచంలో మంచి పనికూడా అంతే గొప్పగా ప్రకాశిస్తుంది. ఎవరి బుద్ధి ఔదార్యము వైరాగ్యరసంలో నిండి ఉంటుందో ఆ ఆనందమయులే పరమసాధకులు. నీతినియమాలు లేనివాడు జీవితగమ్యం తెలియనివాడు ధార్మికంగా పురోగమించలేడు. సహజంగా జీవిస్తే వైరగ్యము వికసితమౌతుంది. కావలసిన కనీస అవసరాలకు మించి ఎక్కువగా కోరుకోవటం పిచ్చి రేపుతుంది. అసలు మన భౌతిక అవసరాలు తీరిన తరువాత అంతకుమించి సంపద ఎందుకు? వానప్రస్థ ఆశ్రమానికి బయలుదేరుతున్న దంపతులకు అడివిలో బంగారుపు కడ్డి కనబడితే భార్య వ్యామోహపడుతుందని గొయ్యితీసి కప్పెడుతూ ఉంటే భార్య విషయం తెలుసుకొని భర్తతో "మట్టిని మట్టి కప్పెడుతున్నారా?" అంది. మనస్సు కోరికలు లేని స్థితిని ఎలా పొందడమంటే ధ్యాననిధితో చిత్తంలోని సంస్కారాలు క్షీణింపచేసుకొని చిత్తం శాంతమై పరమాత్మని పొందే ఇచ్ఛ కూడా లేనప్పడే పరమాత్మ లభిస్తాడు. అప్పడు అనంత వెలుగులో ప్రకాశిస్తాము. శ్రీనాన్నగారు "చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే సత్యాన్ని దర్శించాలి వేరే మార్గంలేదు. నీవు పరమ పవిత్రుడవైతే సత్యమే వెదుక్కుంటూ వస్తుంది" అన్నారు. ఎరుక అనే కవ్వంతో చిత్తంలోని మలినాలను చిలికితే నవనీవమనే వెన్న మనకు లభ్యమౌతుంది. పరమాత్మకు ఆ వెన్నే ఇష్టమని మనమనస్సు వెన్నగా చేసుకొంటే దాన్ని ఆయన తినిమన స్వరూపాన్ని ఎరుకపరుస్తాడు. మనం ప్రకృతిధర్మానుగుణంగా సంచరించగలగాలి. ప్రకృతి ఆశయం స్వాతంత్ర్యం. భార్యభర్తలు ఒకరిని ఒకరు ప్రేమించుకొంటున్నారు అంటే వారిలోని భగవంతుణ్ణి ప్రేమించుకొంటున్నారు ఈ సత్యాన్ని గ్రహించాలి గాని శారీరక ప్రేమనిజంకాదు. భోగక్షేత్రంలో నాటబడిన బీజం ఆధ్యాత్మిక ఉన్నతిని మొలకెత్తనియ్యదు. అక్కడ అపజయం తప్పదు దీనికి ఉదాహరణ రుక్మిణి, సత్యభామల ఉదంతం కానవస్తుంది. రుక్మిణి భర్తను పరమాత్మగా ఎంచింది కలుసుకోవటం కాలవ్యవధి అయినా కలవరం రాలేదు. సత్యభామ శ్రీకృష్ణతులాభారంలో మణుగుల కొలదీ బంగారం వేసినా తూగలేదు. రుక్మిణి భక్తితో ఒక్క తులసి దళానికి పరమాత్మ తేలిపోయాడు. భక్తి బంగారం కన్న మిన్న. సోక్రటీస్ అంటాడు "నా దేహ వికారాలను చూడకండి నామాటల్లో సౌందర్యాన్ని ఆస్వాదించండి" అని. ప్రహ్లాదుడు రాక్షస వంశంలో జన్మించినా శ్రీహరి పాదాలను నిరంతరం స్మరించటం వల్ల ఎన్ని ఆపదల్లో నెట్టినా హృదయ పవిత్రత వల్ల ఆ భక్తికి చక్రి పరవసించాడు ప్రహ్లాదుని మట నిలబెట్టటానికి అనంత ప్రకాశంతో స్థంభం నుండి వెలువడి దుష్టసంహారం చేసాడు. భక్తితో ప్రహ్లాదుడు అగ్రగణ్యుడిని చేసింది. ఏసు "హృదయశుద్ధిగలవారు ధన్యులు వారు దేవున్ని చూచెదరు" అది నిత్యం సత్యం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966